ప్రజాశక్తి

సోమవారం 20 జనవరి 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

వ్యాపారులు రాక నిరుపయోగంగా మారిన రైతు బజారు

నిరుపయోగంగా రైతు బజారు

- ప్రారంభం నుంచి ఖాళీగానే షాపులు
- లక్షల వ్యయంతో నిర్మించినా

ముందుకు రాని రైతులు, వ్యాపారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కూరగాయల క్రయ, విక్రయాలకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రభుత్వం రైతు బజారును ఏర్పాటు చేసింది. ఇందులో 50 దుకాణాలు అన్ని రకాల సౌకర్యాలతో ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్ 17న రైతు బజారును ప్రారంభించారు. వ్యాపారులు, రైతులు ముందుకు రాకపోవడంతో ఆ దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవడం, వ్యాపారాలు బాగా జరగవనే భావతోదుకాణాల్లో చేరేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతు బజారు నిరుపయోగంగా మారింది. కూరగాయల క్రయవిక్రయాలకు వినియోగదారులు, వ్యాపారాలకు ఇబ్బందులు ఉండరాదనియ పట్టణంలోని పుల్లలచెరువు రోడ్డులో గత వైసిపి ప్రభుత్వం హయంలో రూ.కోటి 28 లక్షలతో రైతు బజారును నిర్మించిచారు. 2022 ఆగస్టు 24న అప్పటి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో రైతు బజారును మళ్లీ గత ఏడాది డిసెంబర్ 17న ప్రారంభించారు. 45 షాపులను రైతులు, వ్యాపారుల కోసం ఫ్రీగా ఇచ్చారు. ఐదు షాపులకు రూ.1500 ▶ 2లో

హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి- ఒంగోలుసిటీ

అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బరరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటన నిరసిస్తూ స్థానిక సాగర్ హోటల్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. దేశ ప్రజలకు అమిత్‌షా బహిరంగంగా క్షమాపణలు చెప్పాలన్నారు. లేకుంటే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను హేళన చేస్తూ మాట్లాడిన అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించకుండా, కనీసం క్షమాపణలు చెప్పాలని సూచించకుండా, అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు అతిథి మర్యాదలు చేయడం ఈ దేశానికి ద్రోహం చేసినట్లేనన్నారు. ఈ ఘటనపట్ల వైసిపి మౌనం వహించటం రాజ్యాంగానికి ద్రోహం చేసినట్లేనన్నారు. కూటమిలోని టీడీపీ, జనసేన, వైసీపీకి రాష్ట్రంలోని ప్రజల మీద గౌరవం ఉంటే అమిత్‌షాతో బహిరంగ క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా నాయకులు సర్దార్ మాట్లాడుతూ. భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటనను దేశ ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంబేద్కర్ పట్ల అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా కేంద్రంలోని బిజెపి వైఖరిలో ఎలాంటి మార్పులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ ▶ 2లో

ఒంగోలులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు

బాపట్లలో నిరసన తెలుపుతున్న నాయకులు

పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

- 50 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే

కొనుగోలు చేసిన ప్రభుత్వం

- తక్కువ ధరకు అడుగుతున్న

ప్రైవేటు వ్యాపారులు

ఆరబోసిన ధ్యానం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సుమారు 2.21 లక్షల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. ఐదున్నర లక్షల మెట్రిక్ టన్నుల పైగా దిగుబడి వస్తుంది. అయితే ప్రభుత్వం 50 వేల మెట్రిక్ టన్నులు ధ్యానం కొనుగోలు చేయాలని నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాల ద్వారా 75 కిలోల కామన్ రకం ధాన్యం బస్తా రూ 1,725, గ్రేడ్ ఏ రకం ధాన్యం బసా రూ 1,740 మద్దతు ధరతో జిల్లాలో123 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గతేడాది ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రైవేట్ వ్యాపారులు 75 కిలోల ధాన్యం బస్తా రూ.1800 కొనుగోలు చేశారు. అప్పట్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తక్కువగా ఉండడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించారు. ఈ ఏడాది ప్రైవేట్ వ్యాపారులు బస్తా రూ.1400 మించి కొనుగోలు చేయడం లేదు. ప్రైవేట్ వ్యాపారుల కంటే ప్రభుత్వమే ఎక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించారు. ఖరీఫ్‌లో ప్రభుత్వం తీసుకున్న లక్ష్యం 50 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తయ్యింది. అయితే ఐదున్నర లక్షల మెట్రిక్ టన్నుల పైగా దిగుబడి వచ్చింది. కొందరు రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించారు. అయినప్పటికీ ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరకూ రైతుల వద్దనే ధాన్యం నిల్వ ఉంది.

గత నెలలో వరుసగా వర్షాలు కురిసిన క్రమంలో రైతులు ధాన్యాన్ని పొలాల్లోనే కుప్పలు వేసి ఉంచారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని కొనాలని రైతు సేవాకేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.జిల్లాలో ఇంకా కొంతమేర వరి కోతలు జరగాల్సి ఉంది.ఈక్రమంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై కనీసం మరో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. లేకుంటే ప్రైవేట్ వ్యాపారులు ధరను మరింతగా తగ్గించే పరిస్థితిఉంది. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్ళు ఏటేటా తగ్గుతున్నాయి. రెండేళ్ళ క్రితం వైసిపి ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు లక్ష్యం 1,40,000 మెట్రిక్ టన్నులుగా నిర్ధేశించారు. అప్పట్లో 78 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. గత ఖరీఫ్‌లో 78 వేల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా పెట్టారు. కేవలం 28 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. గత ▶ 2లో

చీకటి పువ్వు నాటికలోని ఓ సన్నివేశం

ఆలోజింప చేసిన 'చీకటి పువ్వు'

▶ 3లో

హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎంఎల్ నాయకురాలు లలిత కుమారి మాట్లాడుతూ అమిత్‌షా తన వ్యాఖ్యలు వెనక్కు తీసుకొని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు జి,రమేష్, సిపిఐ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి. కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీనివాసులు, కె.రమాదేవి, బి.రఘురాం, టి.తిరుపతిరావు, సీనియర్ నాయకులు జాలా అంజయ్య, సిపిఐ నాయకుడు కె.వీరారెడ్డి, న్యూ డెమోక్రసీ నాయకులు సిఎస్.సాగర్, సిపిఎం, సిపిఐ ,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

బాపట్ల: అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలోని ఎన్‌జిఒ హోం సమీపంలోనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గంగయ్య మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వ్యవస్థలలో భాగమైన పార్లమెంట్‌లో ఓ పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర హోంమంత్రిగా, రాజ్యాంగంపై ప్రమాణం చేసి మంత్రి అయిన అమిత్‌షా అంబేద్కర్‌పై అహంకారపూరితంగా చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పు పట్టారు. పార్లమెంట్‌లో ప్రజల అవసరాలను, అభివద్ధిని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాల్సిన సమయంలో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, మణిపూర్ లాంటి రాష్ట్రాల్లో నరమేధం జరుగుతున్నా పట్టించుకోని ఈ పాలక పార్టీల నాయకులు ప్రజల మధ్య చిచ్చుపెట్టి కులాల మతాల పేరిట కొట్టుకు చచ్చేలా చేస్తున్నారన్నారు. వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేస్తున్న అమిత్ షాకు పార్లమెంటుకు వెళ్లే అర్హత లేదన్నారు. అమిషాను కేంద్ర హోంమంత్రి పదవి నుంచి సస్పెండ్ చేయాలన్నారు. రాజ్యాంగం సాక్షిగా ప్రమాణం చేసి ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోడీ వెంటనే 145 కోట్ల మంది దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి, అమిత్‌షాను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై.భాస్కరరావు, కె.నాగేశ్వర రావు, పి.కొండయ్య, బుచ్చిరాజు, టీ.కృష్ణమోహన్, సుభాషిని, శరత్, స్పందన, దిలీప్ పాల్గొన్నారు.

పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

(మొదటిపేజీ తరువాయి)

రబీలో 98 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలని లక్ష్యంగా నిర్ణయించారు. 49 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. గతంలో ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి నగదు చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే ధాన్యం అమ్ముకొని నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రప్రభుత్వం ఖరీఫ్‌కు సంబంధించి మరో మరో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-సంతనూతలపాడు

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలులోని మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గరగల సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో మండలంలోని పేర్నమిట్ట 39వ డివిజన్‌కు చెందిన కొల్లా వెంకటేశ్వర్లుకు 1,18,88 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్‌కుమార్ ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దినేని చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టిడిపి కార్యకర్త మృతి

నివాళులర్పించిన దామచర్ల సత్య

ప్రజాశక్తి-శింగరాయకొండ

మహేంద్ర మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న దామచర్ల సత్య (ఇన్‌సెట్‌లో) మహేంద్ర (ఫైల్)

శింగరాయకొండ మండలం శానంపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త తగరం మహేంద్ర(29) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మహేంద్ర మృతదేహాన్ని రాష్ట్ర మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆదివారం నాడు శానంపూడి గ్రామంలోని మహేంద్ర నివాసానికి వెళ్లి మహేంద్ర మతదేహానికి నివాళులర్పించారు. తగరం మహేంద్ర శనివారం రాత్రి కందుకూరు వద్ద నూతనంగా నిర్మాణం చేపడుతున్న పామూరు బైపాస్ మీద సిటిఆర్ఐ దాటిన తర్వాత చుట్టుగుంట ప్రాంతంలో మోటార్ బైక్ మీద వెళుతూ రోడ్డు ప్రమాదంలో ముడిచిందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి పోస్టుమార్టం పూర్తి చేసి ఆదివారం నాడు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు మహేంద్ర మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మహేంద్ర తెలుగుదేశం పార్టీలో చురుగ్గా పనిచేస్తూ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ఎంతో పనిచేశారని గ్రామస్తులు తెలిపారు. మహేంద్ర మృతదేహాన్ని సందర్శించి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య నివాళులర్పించి మహేంద్ర మరణం ఆ ప్రాంతంలో పార్టీకి తీరనిలోటని తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ సచివాలయ వాలంటీర్ల వయోవృద్ధుల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలుగుదేశం పార్టీ కార్యకర్త మహేంద్ర రోడ్డు ప్రమాదంలో మరణించిన వార్త తెలుసుకొని ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో సిహెచ్ హజరత్తయ్య తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ, గాలి హరిబాబు, పులివర్తి బసవయ్య నాయుడు తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ సంధర్భంగా వైఎస్సార్ క్రికెట్ పోటీలను ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహించిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అభినందనీయుడని దర్శి ఎమ్మెల్యే, వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలో వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసిన సందర్భంగా ఆదివారం జిల్లా స్థాయిలో క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన త్రిపురాంతకం టీంకు రూ.50 వేలు ప్రైజ్ మనీతో పాటు క్రికెట్ టోర్నీ కప్, ద్వితీయ స్థానంలో నిలిచిన గంజివారిపల్లి టీంకు రూ.30 వేలు ప్రైజ్ మనీతో పాటు క్రికెట్ టోర్నీకప్, తృతీయ స్థానం కైవసం చేసుకున్న కొత్తూరుకు రూ.20 వేలు ప్రైజ్ మనీతో పాటు క్రికెట్ టోర్నీ కప్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి క్రీడలను, యువతను ఎంతగానో ప్రోత్సహించారని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతను పట్టించుకోవడం మరిచిందన్నారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రికెట్ పోటీలలో 72 టీములు పాల్గొని పోటాపోటీగా ఆడడం ఆషామాషీ కాదన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా వైసీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రామావత్ అరుణాబాయి, పొన్నా వెంకట లక్ష్మమ్మ, సరళ కుమారి, కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, జబివుల్లా, కోటిరెడ్డి, ముసలారెడ్డి, ఆళ్ల ఆంజనేయరెడ్డి, పోలిరెడ్డి, గంటా వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

కూలీల తరలింపులో జాగ్రత్తలు తీసుకోవాలి

ఒంగోలు రూరల్ సిఐ శ్రీకాంత్‌బాబు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ట్రాక్టర్లలో పచ్చాకు తరలింపు కూలీలకు ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్ శ్రీకాంత్‌బాబు కోరారు. ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాల యంలో ఆదివారం జరిగిన సమావేశంలో సిఐ శ్రీకాంత్‌బాబు మాట్లాడారు. ఒంగోలు రూరల్ సర్కిల్ పరిధిలోని సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గల పొగాకు రైతాంగం, పచ్చాకు కూలీలు ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ శ్రీకాంత్ బాబు కోరారు. పొగాకు కోత కాలంలో పచ్చాకును ట్రాక్టర్లపై బ్యారన్ల వద్దకు తరలిస్తారని అన్నారు. పచ్చాకును ట్రాక్టర్లపై ఎత్తుగా వేసుకుని, దానిపైన కూలీలు కూర్చుంటున్నారని, వెనుక డోర్లను కూడా తీసి వాటిపై కూర్చుంటున్నారని, ఇది ఎంతో ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. దీనివల్ల గతంలో ఎన్నో ప్రమాదాలు సంభవించాయని ఆయన తెలిపారు. పొగాకు తరలింపు కాలంలో పచ్చాకును ఒక ట్రాక్టర్‌పై, కూలీలను మరొక వాహనంపై తరలించాలని, దీనివల్ల ప్రమాదాలు నివారింపబడతాయని ఆయన తెలిపారు. దీనిని ఉల్లంఘించి పచ్చాకు తరలించే ట్రాక్టర్‌పై కూలీలను ఎక్కించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. మద్దిపాడు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు మండలాల పరిధిలోని పొగాకు రైతాంగం దీనిని గమనించి ముందస్తుగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సమాజ సేవకు సరైన వేదిక 'లయన్స్ క్లబ్'

ఆరవ అదనపు జిల్లా జడ్జి శుభవాణి

ప్రజాశక్తి-మార్కాపురం

సమాజ సేవకు సరైన వేదికగా లయన్స్ క్లబ్ నిలవనుందని మార్కాపురంలోని ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం శుభవాణి అన్నారు. అన్నార్తులకు అండగా నిలుస్తూ, పేదలకు సాయం అందించే వేదికగా లయన్స్ క్లబ్ పని చేస్తుందని తెలిపారు. ఆదివారం మార్కాపురం లయన్స్ క్లబ్ ప్రారంభోత్సవం స్థానిక విహారీ గ్రాండ్ ఇన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి శుభవాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులు కూడా లయన్స్ క్లబ్‌లో ఎంతో పనిచేసినట్లు చెప్పారు. కుటుంబీకుల స్ఫూర్తితో తాను సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ 316 హెచ్, జిల్లా గవర్నర్ పి గోపీచంద్ మాట్లాడుతూ క్లబ్ నెలకొల్పేందుకు అవిరళ కృషి చేసిన జోన్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస్ ప్రసాద్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు. డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ చందోలు హరిప్రసాదరావు మాట్లాడుతూ జిల్లా గవర్నర్ స్థాయిలో రూ.12 కోట్ల విలువైన ప్రాజెక్టులను మంజూరు చేయించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నూతన సభ్యుల చేత వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 2 రావిపూడి లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారం చేయించగా, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినేని మోహనరావు, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ వి వెంకటసుబ్బయ్య, జీఎస్టీ కో-ఆర్డినేటర్ ఎస్ వెంకటేశ్వర్లు, జోన్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్, డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, సయ్యద్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా రామకష్ణ

మార్కాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ తళ్లం వెంకట రామకృష్ణారావు నియమితులయ్యారు. కార్యదర్శిగా జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా రిటైర్డ్ ప్రిన్సిపల్ బివి రంగయ్య, ఉపాధ్యక్షులుగా స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూపని కాశయ్య, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ రవ్వా హరినాథ్‌బాబు, సహాయ కోశాధికారిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం మాధవరావు, సర్వీస్ చైర్ పర్సన్‌గా వి వెంకటరామిరెడ్డి, ఎల్‌సిఐఎఫ్ కో ఆర్డినేటర్‌గా బి కోటేశ్వరరావు, మెంబర్‌షిప్ చైర్ పర్సన్‌గా కె చెంచిరెడ్డి, క్లబ్ మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా షేక్ మహబూబ్‌బాషా, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా ఎం శివప్రసాద్ తదితరులు నియమితులైన వారిలో ఉన్నారు. వారంతా ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు.

నిరుపయోగంగా రైతు బజారు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి రూ.2500 వరకూ ధర నిర్ణయించి అద్దెకిచ్చారు. ప్రారంభం నాడు ఆర్భాటం చేయడం మినహా మరుసటి రోజు నుంచే రైతు బజారులో వ్యాపారాలు నిర్వహిం చేందుకు రైతులు, వ్యాపారులు ముందుకు రావడం లేదు.

మొదటి నుంచి ఖాళీగానే..

రైతు బజారు ప్రారంభం నుంచి షాపులు ఖాళీగా ఉంటున్నాయి. వ్యాపారులు కూడా అక్కడ వ్యాపారాలు చేసుకునేందుకు ముందుకు రావడంలేదు. ప్రధాన రోడ్డు పక్కన వ్యాపారాలు బాగా జరుగుతాయని, రైతు బజార్లో జరగవనే భావనతో వారు ఆసక్తి చూపడం లేదు. దీంతో రూ.కోటి 28 లక్షలతో నిర్మించిన రైతుబజారు నిరుపయోగంగా మారింది. ప్రధాన రోడ్డు పక్కన కూరగాయల వ్యాపార దుకాణాలు ఉన్నందున రోడ్డుపైనే వాహనాలు ఆపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సంబంధిత అధికారులు వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించి రైతు బజారు వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాపారులు ముందుకు రావడం లేదు
షేక్ చిన్న ఖాసిం, ఎఎంసి సెక్రటరీ , యర్రగొండపాలెం

మార్కెట్‌లో రైతులు పంట ఉత్పత్తులు అమ్ముకోవాలని పలుమార్లు విన్నవించినా ఎవరూ ముందుకు రావడం లేదు. రైతు బజారు ఖాళీగా ఉండకూడదని వ్యాపారులతో మాట్లాడి షాపులు కూడా కేటాయించాం. అయినా వారు కూడా ఆసక్తి చూపలేదు. ప్రజలు కూడా రైతు బజారుకు వచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం.

సౌకర్యాలు కల్పించాలి: గర్నెపూడి సీమోను, యర్రగొండపాలెం

రైతు బజారులో ప్రజలు కొనుగోలు చేసేందుకు వచ్చిన సమయంలో తగిన సౌకర్యాలు కల్పించాలి. క్యాంటిన్‌ను ఏర్పా టు చేయాలి. రైతు బజారు ముందు భాగం లో ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి. ఇలా చేస్తే కూరగాయలతో పాటు ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు వచ్చే అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది.

రైతులకు కూడా షాపులను కేటాయించాలి
పరిమి కోటేశ్వరరావు, యర్రగొండపాలెం

యర్రగొండ పాలెంలో ఉన్న అన్ని కూరగాయల షాపులను రైతు బజారులో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తే ప్రజలు రైతు బజారుకు నేరుగా వచ్చి కొను గోలు చేస్తారు. నిరంతరం కూరగాయలను పండించే రైతులకు కూడా అక్కడ షాపులు కేటాయిస్తే బాగుండేది. అడిగిన వారందరికీ ఇవ్వడంతో వారు షాపులు పెట్టుకోలేక, ఇతరులకు అవకాశం లేకుండా పోయింది.

ఆలోజింపచేసిన 'చీకటి పువ్వు'

రెండో రోజు ఎన్టీఆర్ కళాపరిషత్ లో ప్రదర్శన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పివిఆర్ గ్రౌండ్‌లో జరుగుతున్న నాటిక ప్రదర్శనలు ఆహుతులను అలరిస్తున్నాయి. ఎన్‌టిఆర్ కళాపరిషత్ రెండోరోజూ ఆదివారం నాటికలు ప్రదర్శించారు. తొలుత పాత చీరాల నటరాజ నాదస్వర బందం వారిచే నాదస్వరం, కొప్పోలు శ్రీ సరస్వతి కోలాటం సమాజం మాస్టర్ నాగార్జున నేతృత్వంలో నిర్వహించిన కోలాట ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రాత్రి ప్రదర్శించిన చీకటి పువ్వు సందేశాత్మక నాటిక ఆహూతులను ఆలోజింపజేసింది.

'పరిస్థితులకి ఏ మనిషీ అతీతం కాదు. అవసరంతోనో, వేరే అవకాశం లేకో, చాలామంది తప్పులు చేయటం సహజం. తమ తప్పు తెలుసుకుని పశ్చాత్తాప పడిన తర్వాత కూడా వారిని దూరం పెట్టకండి. క్షమించి దగ్గరకు తీయండి. క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉంది" అనే సందేశంతో కథా మూలానికి చక్కని సంభాషణలు, సన్నివేశాలు, సస్పెన్స్, ఉద్రేకాలు, ఉద్వేగాలు, అపనమ్మకాలు, ఆత్మవిశ్వాసం, అవసరాలు మనుషుల్ని ఏ బంధాలు లేకపోయినా ఎలా దగ్గరగా మనసును కట్టివేస్తాయో చెప్పే నాటిక ఇది.

చీకటి పువ్వు నాటికలోని ఓ సన్నివేశం

అర్ధరాత్రి ఒక స్త్రీ, పర పురుషుని గదిలో ఉండటం, ఆ గదిలో అప్పుడే చనిపోయిన వ్యక్తి శవం ఉండ డం, పక్కింటి వాటాల్లో ఉన్న ఇద్దరి సహాయం తోడు తీసు కోవడం, అందులో ఒకరు అర్థం చేసుకుంటే .. మరొకరు అవకాశం దొరికింది కదా అని ఆమెను తన శూలాల్లాంటి మాటలతో గుచ్చి గుచ్చి చంపటం.. కథను ఆసక్తికరం చేస్తుంది. ఒక మృతదేహాన్ని అతడి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చాలన్న ఆమె తపనను కుటుంబ సభ్యులు అపార్థం చేసుకుంటారు. అంతిమంగా ఆమె మానసిక పవిత్రతను గుర్తించి మనిషిని బట్టి, చేసే వత్తిని బట్టి, గుణాన్ని అంచనా వేయటం పొరపాటని గ్రహిస్తారు. ఇటువంటి చక్కని కథ మనసును తాకే సంభాషణలు. హరి పాత్ర ధరించిన మంచాల రమేష్ దర్శక బాధ్యతలు కూడా చేపట్టారు. పాత్రధారులు అందరూ పాత్రలలో ఒదిగిపోయారు. పవిత్రగా గుడివాడ లహరి, వంశీగా కొత్తకొండ సత్యనారాయణ, సిద్ధార్థగా దేవులపల్లి గిరి, మోహన్ ప్రసాద్‌గా ఏపూరి శ్రీనివాస్ పాత్రలకు జీవం పోశారు. సురభి నాగరాజు సంగీతం అందించిగా, కె నాగు సాంకేతిక సహాయం అందించారు..

ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచనకు గురిచేసి, చైతన్యం నింపి సమాజ దశా దిశ మార్చడంతో పాటు వ్యక్తులలో మానవీయ స్పందన, ఆలోచన, సమాజాన్ని చూసే దష్టి కోణంలో మార్పును తీసుకురాగలిగేందుకు దోహద పడుతుందని చెప్పొచ్చు. ఈ సందర్భంగా వివిధ ప్రదర్శనలో పాల్గొన్న పలువురు కళాకారులను ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు సత్కరించారు.

తీరంలో అక్రమ నిర్మాణాలు తొలగింపు

సీఫుడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ భవనం కూల్చివేత

ప్రజాశక్తి-చీరాల

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి సముద్ర తీరంలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు అన్నారు. ఆదివారం చీరాల మండలం వాడరేవు గ్రామంలో కోస్టల్ రెగ్యులేటరీ జోన్ నిబంధనలను ఉల్లంఘించి సముద్ర అలల రేఖ హై టైడ్ లైన్‌కు పది మీటర్ల దూరంలో సముద్ర తీరం వెంబడి అక్రమంగా నిర్మిస్తున్న ఐఆర్జీ ఫిషింగ్ కంపెనీ సీఫుడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ భవనాన్ని తొలగించారు. జిల్లా యంత్రాంగం తెల్లవారుజామున నాలుగు సమయంలో తొలగింపు చర్యలు ప్రారంభించారు. ఐఆర్జీ సంస్థ ప్రతినిధులకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఫైనల్ నోటీస్ జారీ చేశారు. అనంతరం చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ పర్యవేక్షణలో సుమారు 50 మంది పోలీసు బలగాలు వాడరేవు గ్రామాన్ని అదుపులోకి తీసుకుని శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. చీరాల తహాశీల్దారు కె.గోపికృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, వీఆర్‌వోలు ఎస్.కళ్యాణ్, యం.సత్యం, సీహెచ్, జయబాబు, ఎస్.గోపాలకృష్ణ, సీహెచ్ సదానంద రావు, రంగారావు, ఆరుద్ర సుబ్బారావు, గవిని సోమయ్య, పాలేటి వెంకటేశ్వర్లు, డీవీ కృష్ణారెడ్డి, సర్వేయర్ రాహుల్‌తో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది మూడు జేసీబీలు వినియోగించి ప్రాసెసింగ్ యూనిట్ భవనాన్ని తొలగించారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో అక్రమ భవన నిర్మాణం తొలగింపు సందర్భంగా వాడరేవు గ్రామంలో ఎటువంటి జరగకుండా, భద్రతలకు భంగం కలగకుండా చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్, చీరాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, వేటపాలెం ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు, ఇంకొల్లు ఎస్ఐ సురేష్, చిన్నగంజాం ఎస్ఐ రమేష్, చీరాల ఒకటో పట్టణ ఎస్ఐ నాగ శ్రీను, యాభై మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ మొయిన్

సందర్శకులు లేని పాకల బీచ్

నిర్మానుష్యంగా పాకల బీచ్

సందర్శకులు రాకుండా పోలీసుల చర్యలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

పాకల బీచ్‌లోకి ఎవరూ వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. సిఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్ఐ బి.మహేంద్రతో పాటు రామాయపట్నం మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాటు చేసి సందర్శకులు ఎవరూ సముద్రం వద్దకు రాకుండా అడ్డుకుంటున్నారు. ఆదివారం భారీగా సముద్ర తీరానికి వచ్చే సందర్శకులు పోలీసుల హెచ్చరికలతో వెనుతిరిగి వెళ్లారు. మూడు రోజుల క్రితం తీరంలో నలుగురు మృతి చెందిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మంత్రి స్వామి ఆదేశాల మేరకు సర్పంచి చంద్రశేఖర్, మత్స్యకారుల సహాయంతో సముద్రం వద్ద పరిశీలించారు. సముద్రంలో సుడిగుండాలు ఏర్పడుతున్నాయని, ఇసుకలో కాలు పెడితే సుడి తిరిగి పడిపోయే అకాశం ఉందన్నారు. ఈ ప్రభావంతోనే నలుగురూ ప్రమాదం బారిన పడి ఉంటారని అనుమానిస్తున్నారు. పోలీసులకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిన్నగంజాం

ప్రాధాన్యతా క్రమంలో మత్స్యకారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం ఆయన నియోజకవర్గ పరిధిలోని చిన్నగంజాం, కారంచేడు మండలాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా చిన్నగంజాం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పల్లెపాలెం, పెద్దగంజాం గ్రామాల్లో మత్స్యకారులు సమస్యల గురించి ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అక్కడ నుంచే నేరుగా ఫోను ద్వారా మత్స్యశాఖ ఏడీతో మాట్లాడారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన పథకాలు, బోట్లు సబ్సిడీలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. మత్స్యకార పెద్దలందరూ వెళ్లి ఫిషరీస్ ఏడీని కలిసి వినతిపత్రం అందించాల్సిందిగా సూచించారు. ముందుగా తెలుగుదేశం పార్టీ చిన్నగంజాం మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ కలాం ఆజాద్ సతీమణి సయ్యద్ ఖాజున్నీసా బీబీ ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో చికిత్స పొందుతున్న స్వర్ణ గ్రామానికి చెందిన మాజీ నీటి సంఘం ప్రెసిడెంట్ బండారు సిరాబందిని ఏలూరి సాంబశివరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పదవీరయ్య, చిన్నగంజాం పెద్దగంజం సర్పంచులు రాయని ఆత్మారావు, నక్కల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా 'వరికూటి'

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త వరికూటి అశోక్ బాబును పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈయన నియామకం పట్ల నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో అధిష్టానం రాష్ట్రస్థాయి పదవిని అప్పగించడం పట్ల అశోక్ బాబు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపై నడిపించి గెలుపుకు కృషి చేస్తానని అశోక్ బాబు తెలిపారు.

వరికూటి అశోక్‌బాబు

మృతదేహం అప్పగింత

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ఇటీవల త్రిపురాంతకం మండల కేంద్రంలో గుర్తు తెలియని మృత దేహం కలకలం రేపింది. అయితే పోలీసులు ఆ మృతదేహం వివరాలు తెలియ కపోవడంతో గుర్తు తెలియని మృత దేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో త్రిపురాంతకం మండల కేంద్రానికి చెందిన మెండ్రగుత్తి మహంకాళి(35) కనిపించడం లేదని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం అందించారు. మహంకాళికి సంబంధించిన ఆన వాళ్లను పోలీసులు సేకరించారు. మృతదేహం ఒంగోలులో ఉండటంతో కుటుంబ సభ్యులను అక్కడకు తీసుకువెళ్లి పరిశీలించగా మహంకాళిగా కుటుంబ సభ్యులు నిర్ధారించారు. దీనితో మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అందచేసినట్లు ఎస్ఐ శివబసవరాజు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ట్రెజరీ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ట్రెజరీ యూనిట్ అసోసియేషన్ ఎన్నిక జిల్లా ట్రెజరీ కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ప్యానల్ నూతన అధ్యక్షులుగా ఎస్.కొండలరావు, కార్యదర్శిగా కె.పవన వెంకట కుమార్, కోశాధికారిగా ఎం.సురేష్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.శంకర్, ఉపాధ్యక్షులుగా ఎస్.నరేంద్ర, వి.సునీత, కె.బేబీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.మహమ్మద్ అనీఫ్, సంయుక్త కార్యదర్శులుగా కె.శ్రీనివాసులు, ఎం.అమరయ్య, కె.సునీత ఎన్నికయ్యారు. ప్యానెల్ ఎన్నికల అధికారిగా ఎస్.కె.అబ్దుల్ ఖాదర్ టీంతో పాటు ట్రెజరీ ప్యానెల్ రాష్ట్ర కార్యదర్శి కరుణ హాజరయ్యారు.

గోకులం షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలోని స్వర్ణపాలెం పంచాయతీలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును ఆదివారం ఎంపీడీవో, స్థానిక నాయకులు ప్రారంభించారు. రూ 2.3 లక్షల వ్యయంతో ఈ గోకులం షెడ్డును నిర్మించారు. పశు సంపదను పెంపొందించుకోవడానికి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో పాడి రైతులు పశుసంపదను పెంపొందించుకోవడానికి, వాటిని సంరక్షించుకోవడానికి ఈ గోకులం షెడ్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కారంచేడు మండల అధ్యక్షులు తిరుమల శెట్టి శ్రీహరి, మండల నాయకులు కొసరాజు సురేంద్రబాబు, షేక్ ఖాసిం, నీటి సంఘం అధ్యక్షులు కొసరాజు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

స్థానిక టీఎం రావు ఉన్నత పాఠశాలలో 1986-87 పదో తరగతి బ్యాచ్ రెండవ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేల్పూరి నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, ఉపేంద్ర, కురాళ్ల రవికుమార్, ఉమాశంకర్ సురేష్ ఉలవలపూడి వరలక్ష్మి, రాధిక, అపర్ణ, వెంకటేశ్వరరావు, గీతా భవాని, బట్టు ఇందిరా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 80 మంది మిత్రులు కలుసుకొని గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

దొంతు ప్రభావతికి ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

దొంతు ప్రభావతి

భట్టిప్రోలు గ్రామానికి చెందిన సాహితీ వేత్త, నంది అవార్డు గ్రహీత దొంతు ప్రభావతి ఈనెల 21వ తేదీన విజయవాడలో జాతీయ ప్రతిభా పురస్కారం అందుకోనున్నారు. రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని ఆమె ఆదివారం తెలిపారు. అలాగే విజయవాడలో తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందజేస్తున్న సందర్భంగా, అంతర్జాతీయ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ అత్తిమండ ప్రతాప్, శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్ శ్రీమతి కొల్లి రమావతి అభినందనలు తెలియజేస్తూ తెలుగు భాషాభివృద్ధికి, సాహితీ, కళా, సేవా రంగాలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారన్నారు. దొంతు ప్రభావతి మరెన్నో ఉన్నత పురస్కారాలు పొందాలని పలువురు ఆకాంక్షించారు. ఈ మేరకు భట్టిప్రోలుకు చెందిన పలువురు మేధావులు, విద్యావేత్తలు, సాహితీవేత్తలు ఆమెకు అభినందనలు తెలిపారు.

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఉత్తమ నాటికలకు బహుమతులు

ప్రజాశక్తి -యద్దనపూడి

ఎన్టీఆర్ కళా పరిషత్ అనంతవరం వారి ఆధ్వర్యంలో జరిగిన నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనలకు శనివారం అర్ధరాత్రి బహుమతులు అందజేశారు. జరల్ బోగీలు నాటిక మొదటి బహుమతికి ఎంపిక అయింది. 27వ మైలు రాయి రెడో బహుమతి, బ్రహ్మ స్వరూపం తృతీయ బహుమతి పొందాయి. ఉత్తమ జూరీ ప్రదర్శనకు (అ)సత్యం నాటిక ఎంపిక అయింది. న్యాయ నిర్ణేతలుగా నూతలపాటి కాళిదాసు, కె.దేవేంద్ర, డాక్టర్ రాయల హరిశ్చంద్ర వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు గుదే పాండు రంగారావు, ఆర్.శ్రీనివాసరావు, కళాకారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శిద్దా రాఘవరావు

ఆర్యవైశ్యులకు అన్నివిధాలా సహకరిస్తా

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరు మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులు అమర శ్రీరామమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం వేంపాడు గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. దర్శి నియోజకవర్గంలో కొన్నివేల కోట్లతో నేను మంత్రిగా ఉన్నప్పుడు అభివృద్ధి చేశానన్నారు. నూతన కమిటీ సభ్యులందరినీ అభినందించారు. అన్ని సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందు ఉండాలని తెలిపారు. అనంతరం శాలువాలతో శిద్దా రాఘవరావుని ఆర్యవైశ్య కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు కోటా హనుమంతరావు, ఆర్యవైశ్య నాయకులు బోగ్గవరపు సుబ్బారావు, సూరే చిన్న సుబ్బారావు, యువజన విభాగం నాయకులు చందోలు మణికంఠ, మండలమూరు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా లక్ష్మణరావును గెలిపించండి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మాట్లాడుతున్న నక్క వెంకటేశ్వర్లు

ప్రచార వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బాపట్ల

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ, కార్మిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె .వినయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగం ప్రైవేటీకరణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్న నేపథ్యంలో పేదలకు విద్య అందడం కోసం తప్పకుండా లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని కోరారు. అలాగే రైతులు, కార్మికులు అనేక రంగాల్లో వివిధ రకాల సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో వారి పక్షాన నిలబడుతున్న లక్ష్మణరావును గెలిపించడం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. 2007లో శాసనమండలి పునరుద్ధరించాక గెలుపొందిన ఎమ్మెల్సీగా గెలుపొందిన లక్ష్మణరావు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, యువజనలు, రైతు ,కౌలు రైతులు ఇరిగేషన్, మహిళలు, అంగన్వాడీలు, సామాజిక తరగతులు సమస్యలను శాసనమండలిలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే గాక అనేక సమస్యల పరిష్కరించడంలో కృషి చేశారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న లక్ష్మణరావు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అనేక సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక కృషి చేశారన్నారు. అన్ని తరగతులు అభిమానం పొందారని తెలిపారు. రాజ్యాంగ లక్ష్యాలకు కట్టుబడి నిజాయితీతో, నిబద్ధతతో పనిచేశారని అన్నారు. 2025 మార్చిలో జరిగే కృష్ణా, గుంటూరు శాసనమండలి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తిరిగి పోటీ చేస్తున్న లక్ష్మణరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ అధికార పార్టీలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉన్న ప్రత్యర్థుల ఎత్తుగడలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాసంఘాల ఉద్యమాలే లక్ష్మరావును గెలిపిస్తాయన్నారు. ప్రజాసంఘాల ప్రజల హక్కులను కాపాడాలంటే లక్ష్మణరావును గెలిపించుకోవాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు గెలిపించుకోలేకపోతే మన హక్కులను కోల్పోయే పరిస్థితి ఎదురవుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రచార గోడ ప్రతులను నక్క వెంకటేశ్వర్లు యుటిఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ కన్వీనర్ హనుమంతరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు బిక్షాలు, సురేష్, సుబ్బారావు, ప్రజాసంఘాల నాయకులు కృష్ణ మోహన్, కొండయ్య, శరత్, కుమార్, లక్ష్మణ్, సుభాషిని, నూతలపాటి కోటేశ్వరావు, వై.భాస్కరరావు, కె.నాగేశ్వరావు పాల్గొన్నారు.

మనువాద భావజాలంతోనే అమిత్‌షా వ్యాఖ్యలు

సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బాబూరావు

అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాలు, ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి - చీరాల

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మనువాద భావజాలంతో అవమానకర వ్యాఖ్యలు చేశారని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి ఎన్.బాబురావు అన్నారు. అమిత్ షా రాష్ట్రంలో పర్యటిస్తున్న నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని అవమానపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన దానికి నిరసనగా ఆదివారం చీరాల గడియార స్తంభం సెంటర్లో వామపక్షాలు, ప్రజాసంఘాలు నిరసన తెలిపి, అమిత్‌షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్.బాబురావు మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న విభిన్న కులాలు, విభిన్న మతాలు, విభిన్న ఆచారాలు, సంప్రదాయాలు అందరినీ ఐక్యం చేసి కలిసి మెలసి జీవించేవిధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాయకత్వంలో రాజ్యాంగం రూపొందిస్తే అలాంటి రాజ్యాంగ రూపకర్త అయిన డాక్టర్ బిఆర్‌అంబేద్కర్‌పై రాజ్యసభ సాక్షిగా కేంద్ర హోంమంత్రి హోదాలో అమిత్‌షా అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం అన్నారు. అంబేద్కర్‌పైన గౌరవం లేని వ్యక్తి రాజ్యాంగ పదవిలో కొనసాగడానికి ఏమాత్రం అర్హుడు కాదన్నారు. తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా రాష్ట్రాన్ని అడ్డగోలుగా విడగొట్టి ప్రత్యేక హోదా ఇస్తాం, ప్యాకేజీ ఇస్తాం అని తెలుగు ప్రజలను నమ్మబలికి ఇప్పుడు ఇది ముగిసిపోయిన అధ్యాయం అని వ్యాఖ్యానించడం తెలుగు ప్రజలను అవమానించడమే అన్నారు. రాజ్యాంగంపైన, తెలుగు ప్రజలపైన, రాష్ట్రంపైన, విశ్వాసం లేని వ్యక్తి రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.నారప రెడ్డి, బీసీ ఫెడరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, దళిత, బహుజన పార్టీ నాయకులు జిలాని, బలహీన వర్గాల సమైక్య నాయకులు సామ్యూల్, పవన్ కుమార్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు బడుగు విమలాకర్, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

చీరాలలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

కొల్లూరు : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో 'గో బ్యాక్ అమిత్ షా' అంటూ నిరసన తెలిపారు. అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని వామపక్షాలు రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు సిపిఎం కొల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో కొల్లూరు స్థానిక సంజీవ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కొల్లూరు మండల కార్యదర్శి వేములపల్లి వెంకట రామయ్య మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ పేరును ఉచ్చరిస్తూ చేసిన అహంకారపూరిత, అవమాన పూరిత వ్యాఖ్యలు భారత రాజ్యాంగాన్ని తక్కువ చేయడమేనని ఆయన అన్నారు. అంబేద్కర్ అంబేద్కర్ అని పదే పదే ఆయనను తలిచే కన్నా రామా రామా అంటే ఏడు జన్మల పుణ్యం దొరుకుతుందని అనడం అంబేద్కర్‌ని అవమానించడమేనని ఆయన అన్నారు. అమిత్ షాను మంత్రి మండలి నుంచి తొలగించాలని ఆయన కోరారు. ఈ దేశంలో దళిత, గిరిజన ప్రజలపై, మహిళలపై దాడులు జరుగుతుంటే ఏమాత్రం మాట్లాడని దేశ ప్రధాని మోదీ అమిత్ షాను వెనకేసుకొరావడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొల్లూరు మండల కమిటీ సభ్యులు బొనిగల సుబ్బారావు, రఘుబాబు, కూచిపూడి మోషే, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ముండ్లమూరు: అమిత్‌షా రాకను వ్యతిరేకిస్తూ ముండ్లమూరులో అంబేద్కర్ బొమ్మ వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 19న విజయవాడ రాకను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా ముండ్లమూరులో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దేశంలో అంబేద్కర్ రచించిన 'భారత రాజ్యాంగానికి' బదులుగా 'ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని' అమలు చేసే దిశగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ ప్రణాళికబద్ధంగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ని అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమే అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పాలనలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రేపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు, పంటా ఏడుకొండలు, బొమ్మతోటి రాజా రమేష్, పొట్లూరి సుబ్బారావు, నన్నం రామాంజనేయులు, గోపనబోయిన హనుమంతరావు, తిరుపతిరావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

'సహకార' ఉద్యోగుల

సమస్యలు పరిష్కారమయ్యేనా..?

- దశల వారీ ఆందోళనకు ప్రణాళికలు
- నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

సహకార రంగంలోని ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలు అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, 2019లో సర్వీస్‌లో చేరిన ఉద్యోగులను కొనసాగించాలని, సహకార రంగానికి గుదిబండగా పరిణమించిన 2022 సహకార చట్టాన్ని 1964 సహకార చట్టానికి అనుగుణంగా మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ సహకార రంగ ఉద్యోగులు రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) దశల వారి ఆందోళనకు పిలుపునిచ్చింది. ఆ పిలుపుమేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు..

సహకార వ్యవస్థలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలు సిబ్బంది మెడకు గుదిబండగా మారాయి. రైతు సంక్షేమానికి ఆటంకంగా పరిణమించాయి. గత ప్రభుత్వం 2022లో సహకార బ్యాంకులలో 50 శాతం వాటాలను ప్రైవేట్ వ్యక్తులు,కంపెనీలకు హక్కులు కల్పిస్తూ 1964 సహకార చట్టాన్ని మార్చింది. ఈ చట్టం ద్వారా కార్పొరేట్లు కంపెనీల యజమానులను ఏ క్లాస్ సభ్యులుగా గుర్తించి బోర్డులో (పాలకవర్గం) చోటు కల్పించాలని చట్టం నిర్దేశించింది. ఈ చట్టం ద్వారా పాలకవర్గ పగ్గాలు చేపట్టిన వ్యక్తులు, వ్యక్తుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చి, రైతు సంక్షేమం, ఇతర సామాజిక ప్రయోజనాలను విస్మరించే అవకాశం ఉంది. ఈ కారణంగా ఉద్యోగుల భద్రతకు ముప్పు వాటిల్లడంతో, పాటు రైతు సంక్షేమానికి గండి పడనుంది. పాలక మండళ్ళ, సహకారబ్యాంకులను తమకు అనుకూలంగా మార్చుకోవటం వంటి పరిణామాలు చోటు చేసు కుంటున్నాయి . తాజా చట్టంతో వ్యవసాయ పరపతి సంఘాల స్థానంలో వ్యవసాయ సహకార సంఘాల పేరుతో సంఘాలు ఏర్పాటు చేసుకొని లబ్ధి పొందే అవకాశం ఉంది. పూర్తిస్థాయి ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడం వల్ల ఉద్యోగుల కొరత ఏర్పడింది. 40 నుంచి 50 మంది పనిచేసే చోట కేవలం ఎనిమిది,నుంచి తొమ్మిది మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో పని ఒత్తిడి పెరిగింది. కంప్యూటరీకరణ వ్యవస్థ వల్ల టెక్నికల్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి .ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలు అమలు కాకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా జనవరి 2024 నాటికి వివిధ స్థాయి ఉద్యోగులు సుమారు 1,000 మంది ఉద్యోగ విరమణ చేసినట్లు సమాచారం

ఉద్యోగ విరమణ వయస్సు 60 కే పరిమితం....

సహకార వ్యవస్థ, డిసిసిబి,పిఎసిఎస్,ఆప్కాబ్‌లో ఉద్యోగ విరమణ వయసు 62 అమలు కాకపోవటం గమనార్హం. 62 సంవత్సరాల అమలుకు అనుకూలంగా ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి 2023 మార్చి 31న తీర్మానం చేశారు. ఈ తీర్మానానికి బోర్డు ఆమోదం తెలిపినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించలేదు. దీంతో ప్రతి డీసీసీబీ నుంచి నలుగురైదుగురు చొప్పున కోర్టును ఆశ్రయించి కోర్టు ద్వారా ఉద్యోగాలలో కొనసాగుతున్నారు. ప్రకాశం జిల్లాలో తప్ప మిగిలిన అన్ని డిసిసిబిలు కోర్టు ద్వారా ఉద్యోగంలో కొనసాగుతున్న వారికి జీతాలు చెల్లిస్తున్నాయి . ఈ లోపు(2022 జనవరి నుంచి)ఉద్యోగ విరమణ పొందిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై 60 ఏళ్లకే పరిమితం చేస్తూ మెలిక పెట్టింది. కొందరు ఏపీ సహకార చట్టం 115 డి (2) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే సర్వీస్ నిబంధనలు తమకు వర్తిస్తాయని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 2023 మే 5న రాష్ట్ర ఏకీకృత నిధి నుంచి జీతభత్యాలు పొందే వారికి మాత్రమే 62 వర్తిస్తుందని కోర్టు తీర్పు ఇచ్చింది. ఉద్యోగ సంఘాలు 2019 జీవో 15 ఫిబ్రవరి 4 ఉత్తర్వులు ప్రకారం అప్పటి ప్రభుత్వం 58 ఏళ్ల నుంచి 60కి పెంచిన జీవో ఉత్తర్వు గురించి,ప్రభుత్వం దృష్టికి తెస్తూ 62 వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆందోళన కొనసాగిస్తున్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం వేతన సవరణ చేయాలని,జీవో నెంబర్ 90 ఏపీ సహకార బ్యాంకుల హెచ్ఆర్ పాలసీ మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ రంగ ఉద్యోగులకు ఎలాంటి సర్వీసు విధివిధానాలు అమలు చేస్తున్నారో వాటిని తమకు వర్తింపజేయాలని దశలవారీగా ఆందోళన బాట పట్టారు.

దేశంలోనే అగ్ర స్థానం....

సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా 2022- 23 ఆర్థిక సంవత్సరానికి రూ1. లక్ష కోట్ల వ్యాపారం నిర్వహించి గ్రామీణ సహకార వ్యవస్థలో దేశంలోనే ప్రథమ స్థానం దక్కించుకుంది అప్కాబ్. 2023 ఆగస్టులో అప్కాబ్ 60 సంవత్సరాల వజ్రోత్సవ వేడుకల్లో ఆప్కాబ్ పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేయడం విశేషం. ప్రస్తుత విభజన ఆంధ్రప్రదేశ్‌లో 13 జిల్లా సహకార బ్యాంకులు, 425 బ్రాంచీలు, 1995 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా లక్షలాదిమంది చిన్న, సన్నకారు రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందించి ఆర్థిక వెసులుబాటును కలిపిస్తుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు, డిఆర్‌డిఎ, మెప్మా, జిఎల్‌జి గ్రూపులు, సూపర్ సిక్స్ లాంటి పథకాలను విస్తృతంగా అమలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఎటిఎంలు, మొబైల్ ఎటిఎంలు ఏర్పాటు చేసి సేవలందించడంలో ముందుంది. నెట్ బ్యాంకింగ్,మొబైల్ బ్యాంకింగ్ సేవలను అందుబాటులో తెచ్చి కోర్ బ్యాంకింగ్ నెట్వర్క్‌ను ప్రవేశపెట్టే దిశగా అడుగులు వేస్తోంది. దేశంలోనే అత్యుత్తమ సేవలు అందిస్తున్న బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసే చట్టాలను మార్చాలని, రైతు సంక్షేమం, సమాజ సంక్షేమం కోసం దోహదపడే విధంగా చట్టాలు అమలు చేయాలని కోరుతూ ఉద్యోగ సంఘాలు ఆందోళన బాట పట్టారు.

62 సంవత్సరాల అమలు కోసం...

ప్రభుత్వ లెక్కల అనుసరించి 2031 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఆప్కాబ్(డిసిసిబి, వ్యవసాయ పరపతి సంఘాలు)లో సుమారు. 1.15 లక్షల మంది ఉద్యోగ విరమణ చేయనున్నటుల తెలుస్తోంది. పొరుగు రాష్ట్రాలు మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లో 62 ఏళ్ల అమలు చేస్తున్న వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. తెలంగాణలోనూ 61 సంవత్సరాలు అమల్లో ఉందని సంఘ నేతలు పేర్కొంటున్నారు. జీవో నెంబర్ 36, ప్రకారం వేతన సవరణ చేయాలి, జీవో నెంబర్ 90 ప్రకారం హెచ్ఆర్ మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే నియమావళిని సహకార రంగ ఉద్యోగులకు వర్తింపజేయాలని. గ్రాట్యూటీ పెంచాలని, కంప్యూటరీకరణ వ్యవస్థలోని టెక్నికల్ సమస్యలను తొలగించాలి, పని ఒత్తిడి తగ్గించాలని 2019లో సర్వీస్‌లో చేరిన ఉద్యోగులందరినీ కొనసాగించాలని, మెడికల్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరుతున్నారు. చట్ట ప్రకారం డెస్క్రిషనరీ లెర్నర్ సపోర్ట్ ఫండ్ (డిఎల్‌ఎస్ఎఫ్) ఏర్పాటు చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.. ఈ సమస్యలపై రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) నేతృత్వంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు.

నేడు ధర్నాను జయప్రదం చేయాలి

సహకార ఉద్యోగుల సమస్యలపై సోమవారం తలపెట్టనున్న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ సిఐటియు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు పి.హనుమంతరావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.మనోజ్ కుమార్. జి. రామాంజిరెడ్డి ఓ ప్రకటనలో కోరారు. జీవో 36 ను వెంటనే అమలు చేయాలని, గ్రాట్యూటీ పెంచాలని సిబ్బందిపై పని వత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న ధర్నాకు సహకార సంఘాల ఉద్యోగులందరూ హాజరుకావాలని వారు కోరారు

ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

ఏపిఆర్ఎస్ఎ జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపిఆర్ఎస్ఎ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పి.మధుసూదనరావు, ఆర్.వాసుదేవరావు ఎన్నికయ్యారు. స్థానిక ఏపిఆర్ఎస్ఎ భవన్‌లో జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా సిహెచ్.సురేష్ బాబు, ఎస్‌కె.మహబూబ్ బాషా, పెంచలరెడ్డి వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియలో ఒంగోలు కలెక్టరేట్ యూనిట్, కనిగిరి, మార్కాపురం యూనిట్ల కార్యవర్గ సభ్యులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. ఏపిఆర్ఎస్ఎ జిల్లా అధ్యక్షుడిగా పి.మధు సూదనరావు (తహశీల్దార్, కొత్తపట్నం), అసోసియేట్ అధ్యక్షుడిగా వి.కిరణ్ (తహశీల్దార్, కంభం), ఉపాధ్యక్షులుగా ఎ.రవిశంకర్ (డిటీకనిగిరి), జి.రజని కుమారి (తహశీల్దార్, కురిచేడు), ఎన్.వెంకట భార్గవ్ రాజేష్(డిటీ పిఎస్‌విపి, ఒంగోలు), కె.కాశయ్య(డిటీ, కొండపి), కార్యదర్శిగా ఆర్. వాసుదేవరావు(డిటీ, ఎన్‌జిపాడు), కార్యనిర్వాహక కార్యదర్శిగా పిఆర్ఎస్. శర్మ(సీనియర్ అసిస్టెంట్, ఒంగోలు). స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా ఆర్. రామనారాయణరెడ్డి(డిటీ, గిద్దలూరు), సంయుక్త కార్య దర్శులుగా కె.శాంతి(తహశీల్దార్, దోర్నాల),కె.కిశోర్ కుమార్(డిటీ, హెచ్‌ఎంపాడు), కె.అశోక్ కుమార్(డిటీ, ఒంగోలు), బివి. సుబ్బారావు(ఆఫీస్ సబార్డినేట్, ఒంగోలు), కోశాధికారిగా వి.శ్రీనివాసరావు(సీనియర్ అసిస్టెంట్, ఒంగోలు) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జె.శ్రీనాథ్(డిటీ, టంగుటూరు), ఎస్‌కె. షాజహాన్(డిటీ, ఎస్‌సి కార్పొరేషన్), డి.వెంకటేశ్వరరావు (సీనియర్ అసిస్టెంట్, కొండపి), ఎన్.గోపి(ఎంఆర్ఐ, పెద్దారవీడు), వై.ప్రశాంత్ నాయుడు(టైపిస్ట్ ఒంగోలు), పి.మాధవరావు (డిటీ, చీమకుర్తి) ఎం.చైతన్య(సీనియర్ అసిస్టెంట్, కొత్తపట్నం) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏపిఆర్ఎస్ఎ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదనరావు మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజాసమస్యలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. కార్మిక కర్షక ఐక్యతా దినోత్సవం సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక,కర్షక ఉద్యమాలను అణచివేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులను హరించి వేసేందుకు నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టిన అంశాన్ని సందర్భంగా గుర్తు చేశారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆందోళన చేపట్టిన రైతు ఉద్యమాలను అణచి వేస్తున్నారన్నారు. మరోవైపు ప్రజలపై భారాల మోపుతూ

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ప్రజాస్వామ్య హక్కులను సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరించి వేస్తున్నాయన్నారు. 43వ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని కాల్పుల్లో అమరులైన వారికి సమావేశం నివాళులర్పించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రైతు సంఘం, కౌలు రైతుసంఘం, ,సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం తో పాటు కలిసి వచ్చే అన్ని సంఘాల తో పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె జయంతి బాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి, కెవిపిఎస్ ఉపాధ్యక్షుడు వేసుపోగు మోజెస్ ,సిఐటియు పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు ఉబ్బా వెంకటేశ్వర్లు ,స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి ,కంకణాల వెంకటేశ్వర్లు ,టి.తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న జేసీ ప్రఖర్ జైన్

యోగి వేమనకు ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

యోగి వేమన పద్యాలు పలకని తెలుగువారు ఉండరని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. యోగి వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి డి.గంగాధర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ యోగివేమన తెలుగు భాషలో భారతీయ తత్వవేత్త మరియు కవి అని అన్నారు. ఆయన కవితలు సరళమైన భాష, స్థానిక యాసలను కలిగి ఉంటాయన్నారు. అందుకే వేమన కవితలు బహుళ ప్రాచుర్యం పొందినట్లు తెలిపారు. యోగి వేమన జీవిత చరిత్రపై చలనచిత్రం నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జివి.శివలీల, సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలి

నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-దర్శి

సిపిఎం, సిపిఐ అధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటనని వ్యతిరేకిస్తూ స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు తాండవ రంగారావు, మాడపాకుల రమేష్‌బాబు మాట్లాడారు. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి, ఆ రాజ్యాంగాన్ని రచించిన నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేయడం అంటే ఈ దేశ ప్రజలందరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే అవుతుందని అన్నారు. దీనికి బాధ్యత వహించి ఆయన తన పదవికి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా ఆదివారం విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపుతున్నామని తెలిపారు. ప్రజలంతా అమిత్‌షా వ్యాఖ్యలను వ్యతిరేకించాలని అన్నారు. బిజెపి అనుసరిస్తున్న మత ఉన్మాదమే దినికి కారణమని అన్నారు. అంబేద్కర్ రాసిన దేశ లౌకిక రాజ్యాంగం బిజెపికి కట్టగింపుగా ఉందని, అందుకోసమే బిజెపి నాయకులు బరితెగించి ఇలా మాట్లాడుతున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ ఎప్పటి నుంచో చూస్తున్నాయని అన్నారు. ఇప్పుడు కేంద్రంలో అధికారంలోకి రావడంతో మన దేశ లౌకిక రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందని అన్నారు. ప్రజలంతా బిజెపి మతోన్మాధాన్ని వ్యతిరేకించడం ద్వారా తిప్పికొట్టాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు రాచపూడి కరుణానిధి, కెవి పిచ్చయ్య, కల్లూరి అంజనేయులు, ఈమని నాగేశ్వరరావు, ఉప్పునారాయణ, ఇత్తడి సామ్యేల్ పాల్గొన్నారు.

'స్వామినాథన్' సిఫార్సులు అమలు చేయాలి

మాట్లాడుతున్న వీరారెడ్డి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, హర్యానా సరిహద్దుల్లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న దాలే లావా ఆరోగ్యాన్ని కాపాడాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్రా వీరారెడ్డి కేంద్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు. స్థానిక గుజ్జుల యలమందారెడ్డి స్మార్క్ భవన్‌లో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు నాయకులు జగజ్జీత్సింగ్ దలేవాల్ 55 రోజుల నుంచి ఆమరణదీక్ష చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవ హరించడం బాధాకరమని అన్నారు. రైతులు పండించిన పంటలకు కనీసం మద్దతు ధర పలికేలా చట్టం తేవాలని అన్నారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం రైతుల పాలిట శాపంగా ఉందన్నారు. మార్కెటింగ్ సొసైటీలను రద్దు చేసి కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టాలని కేంద్రం చూస్తుందని ఆరోపించారు. గత సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా మోడీ ప్రభుత్వానికి తలవంచి పని చేస్తు న్నాయని విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసేం దుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో ఏఐకెఎస్ జాతీయ మహాసభలు ఏప్రిల్ నెలలో జరుగుతాయని తెలిపారు. గ్రామ స్థాయిలో శాఖలు ఏర్పాటు చేసి సభ్యత్వం చేర్పించాలని సూచించారు. ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పివి కొండయ్య మాట్లాడుతూ రైతు సంఘం సభ్యత్వం వసూళ్ల త్వరలో చేపడతామని తెలిపారు. గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం అధ్యక్షులు సిగినం వెంకటేశ్వర్లు, సిపిఐ కార్యదర్శి కోక్కరమెట్ల కోటేశ్వరరావు, నాయకులు సిహెచ్ పెద్దసిద్ధయ్య, కృష్ణయ్య, కడెం కొండలు, శ్రీనివాసులు, వి చెన్నారెడ్డిలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఇదే

'గాండ్ల' సత్రం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కొనకనమిట్ల

శ్రీవెలిగొండ అఖిల గాండ్ల అన్నసత్రం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఎన్నికలకు అధికారులుగా తంగెళ్ల నాగభూషణం, చిట్టెంశెట్టి వెంకటసుబ్బారావు, వరికుంట్ల వెంకటేశ్వర్లు, భీమవరం పిచ్చయ్య ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా బట్టు రామారావు, బట్టు మహానంది, బల్లవరపు వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా అళ్లచెరువు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా యేరువ కృష్ణారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దపాటి కృష్ణయ్య, కోశాధికారిగా ఆళ్లచెరువు మోహన్‌రావు, మహిళా కార్యదర్శిగా మాద సుభద్ర ఎన్నికయ్యారు. నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు కుల బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సమావేశమైన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - పామూరు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 77 – 78వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని అనిల్ గార్డెన్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ముందుగా ఉన్నత పాఠశాల దగ్గరికి వెళ్లి పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల గురువులైన ఓరుగంటి సింగయ్య, పెరుగుపల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులకు శాలువలతో సన్మానం చేశారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ ఖాదర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దీక్షితులు, బాషా, హెచ్‌ఎం రామస్వామి, సయ్యద్ హనీఫ్, రాయవరపు మాల్యాద్రి చౌదరి, ఏలూరు ఎక్సైజ్ అధికారి కేతు వెంకటరామిరెడ్డి, జగదాభి మాల్యాద్రి, చిన్న మౌలాలి, రమణారెడ్డి, గౌస్ బాషా, కందుల నారాయణరెడ్డి, కెఎస్ ప్రసాద్, పాగోలు విజయలక్ష్మి, దరిశి రాజు లక్ష్మి, సుందరి విజయమ్మ, విజయలక్ష్మి తదితర విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందం వ్యక్తం చేశారు.

మృతదేహాన్ని పరిశీస్తున్న ఎస్ఐ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని తూర్పువీరయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన దర్నాసి చిన్నబాబు తన స్నేహితులైన మాలపాటి అనిల్(22), యరమాల ధర్మారావు కలిసి యరమాల ధర్మారావుకి చెందిన కారులో తూర్పువీరాయపాలెం గ్రామ పొలిమేరకు వెళ్ళి అక్కడి నుండి బోట్లపాలెం వెళ్లి అక్కడ తిరిగి వస్తున్న సమయంలో తూర్పువీరాయపాలెం మలుపు వద్ద కారు అదుపు తప్పి పంట పొలంలోనికి వెళ్ళి అక్కడ ఉన్న స్థంబాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మాలపాటి అనిల్‌కు గాయాలైన బురదలో కూరుకుపోయి స్పృహ కోల్పోయాడు. దర్నాసి చిన్నబాబు తలపై చిన్నగాయాలు అయ్యాయి. యరమాల ధర్మారావు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను దర్శిలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్ళగా మాలపాటి అనిల్ అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న యర్రం వెంకటరెడ్డి

ప్రజాశక్తి - పొదిలి

నగర పంచాయతీ పరిధిలోని బుచ్చెనపాలెం గ్రామంలో ఆదివారం మల్లెల చిన్న కోటయ్య (70) అకాలంగా మృతి చెందారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన రెడ్డి జేఏసీ డాక్టర్స్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి చిన్నకోటయ్య సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మట్టి ఖర్చులు నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయం మృతుని కుటుంబానికి అందించారు. ఆయన వెంట ఎస్సీ సెల్ నాయకులు మల్లెల యేబు పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వదిస్తున్న డాక్టర్ లక్ష్మి, లలిత్‌సాగర్

చిన్నారికి డాక్టర్ లక్ష్మీ ఆశీర్వాదం

ప్రజాశక్తి-కురిచేడు

టిడిపి పట్టణ నాయకులు కందుల కృష్ణారెడ్డి, అంజలిల కుమార్తె వీక్షిత ఓణిల బహుకరణ వేడుకలకు తెలుగుదేశం ఇన్‌చార్జి డాకర్ గొట్టిపాటి లక్ష్మి, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ పాల్గొని చిన్నారిని ఆశీర్వాదించారు. ఈ సందర్భంగా వికలాంగుడు చామర్తి శ్రీనుకు మూడు చక్రాల బండిని ఇస్తామని డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలితసాగర్ హామీ ఇచ్చారు. దివ్యాంగుల సంక్షేమం కోసమే తమ ప్రభుత్వం రూ.6వేలకు పెన్షన్ పెంచినట్లు తెలిపారు. డ్వాక్రా పొదుపు సంఘాల తరహాలో దివ్యాంగులకు సంఘాలు ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల మాజీ అధ్యక్షులు కాట్రాజు నాగరాజు, మొగల్ మస్తాన్‌వలి, డాక్టర్ ఎస్‌కె సునీల్, బొల్లేపల్లి ఆదినారాయణ, పెద్దిరెడ్డి, కాటన్ చంద్రరెడ్డి, గంధం గుర్నాథం, మర్రి సుబ్బారావు పాల్గొన్నారు.

ఖైదీతో మాట్లాడుతున్న న్యాయవాది పరిటాల సురేష్

ఖైదీల వసతులపై పరిశీలన

ప్రజాశక్తి-దర్శి

స్థానిక సబ్ జైల్‌లో ఆదివారం ఉదయం లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది పరిటాల సురేష్ ఖైదీలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పేదలకు అందుతున్న న్యాయ సహాయం, న్యాయవాది లేని వారికి ఉచిత సహాయం, భోజనం గురించి ఆరా తీశారు. పేదలకు ఉచిత న్యాయ సహాయం చేసేందుకే లోక్‌అదాలత్‌తోపాటు న్యాయ సేవా కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. న్యాయ సంస్థలు అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖైదీలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియ చేయాలని కోరారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ వెంకట రమణ, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత సాగర్

పిడతల గురమ్మకు నివాళి

ప్రజాశక్తి-కురిచేడు

మండలంలోని పడమర వీయపాలెంలో టిడిపి మండల అధ్యక్షులు పిడతల నెమిలయ్య తల్లి పిడతల గురమ్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆమె దశదిన కర్మ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత సాగర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నెమిలయ్య కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో దొనకొండ, ముండ్లమూరు మండలాల టిడిపి అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వరరావు, కూరపాటి శ్రీను, ముండ్లమూరు మాజీ ఎంపిపి మందలపు వెంకట్రావు, టిడిపి కురిచేడు మాజీ అధ్యక్షులు అధ్యక్షులు కాట్రాజు నాగరాజు, మాజీ ఎంపిపి గడ్డం బాలయ్య, బిసిసెల్ అధ్యక్షులు మోడీ వెంకటేశ్వర్లు, వాణిజ్య విభాగం అధ్యక్షులు కళ్ల వెంకటేశ్వర్లు, బి ఆదినారాయణ, కడియాల రమేష్, టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యలో తీసుకొస్తున్న మార్పులతో విద్యార్థులకు చేటు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఇంటర్మీడియట్ విద్యామండలి 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యలో తీసుకొస్తున్న మార్పులు విద్యార్థులకు చేటుగా ఉన్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. ఇంటర్ విద్యలో మార్పులు - విద్యార్థులకు చేటు అనే అంశంపై ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో విశ్రాంత ఆర్‌జెడి గోపాల రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రద్దు చేస్తే ఆ భారం రెండో ఏడాదిపై పడుతుందన్నారు. రెండేళ్ల పాటు చదివిన పాఠ్యాంశాలు ఒకేసారి రాయటం విద్యార్థులకు భారంగా పరిణమిస్తుందన్నారు. ఇంటర్ విద్యపై 1964లో కొఠారి కమిషన్ వేస్తే 1966 వరకూ రెండేళ్లపాటు విశాలమైన చర్చలు జరిగిన తర్వాతనే ఇంటర్మీడియట్ విద్య అమల్లోకి వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ అంశాన్ని విస్తరించి 26 లోపు అభిప్రాయాలు చెప్పమనడం సరికాదన్నారు. ఈ అంశంపై జిల్లాస్థాయిలో

సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఆర్‌జెడి గోపాల్ రెడ్డి

విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు విస్తృత స్థాయిలో చర్చించాలన్నారు. ఆర్ఐఒలు జిల్లాస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ చేపట్టాలని సూచించారు. విశ్రాంత ప్రిన్సిపల్ ఎవి. పుల్లారావు మాట్లాడుతూ ఇంటర్‌లో ఇంటర్నల్ మార్కుల విధానం కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చేదిగా ఉందన్నారు. విద్యారంగంలో అనుభవజ్ఞులైన వ్యక్తులను సంప్రదించకుండానే ఇంటర్నల్ మార్కులు ప్రతిపాదన సరికాదన్నారు. ఈ మార్కుల విధానం ప్రశ్నించే తత్వాన్ని అడ్డుకుంటుందన్నారు. ప్రశ్నించే తత్వం లేని చోట పరిశోధన జరగదన్నారు. విద్య ఉమ్మడి జాబితాలోని అంశాన్ని విస్మరించి సంస్కరణలు పేరుతో విద్యను కాషాయీకరణ చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. విశ్రాంత ప్రిన్సిపల్ టి. వెంకటేశ్వర రెడ్డి ఇంటర్నల్ మార్కుల విధానం పేద విద్యార్థులను చదువులకు దూరం చేసేదిగా ఉందన్నారు. కళాశాలలో సౌకర్యాలు మెరుగుపరచడం, అవసరమైన సిబ్బందిని కేటాయించడం వంటి చర్యలు చేపట్టకుండా సంస్కరణ పేరుతో విద్యా వ్యవస్థలో మార్పులు సరికాదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలన్నారు. ఇంటర్నల్ మార్కుల విధానంతో ఎస్‌సి,ఎస్‌టి వెనుకబడిన పేద విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె. విజయ్, ఒంగోలు నగర కార్యదర్శి బండి వీరాస్వామి , జిల్లా కమిటీ సభ్యులు ఆరోన్, సాయి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణకు ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి

పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సివి మోహన్ రావు

ప్రజాశక్తి-రేపల్లె

వృద్ధుల సంరక్షణకు పట్టణంలో ట్రిబ్యునల్ ఏర్పాటు చెయ్యాలని పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సివి మోహన్ రావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై, మానవ సంబంధాలకు విలువ లేకుండా పోతుందన్నారు. కన్న బిడ్డలు కర్కశంగా ఉండి, జన్మనిచ్చిన వారిని వదలించు కోవాలని, కనీస అవసరాలు తీర్చకుండా నిరాదరణకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తి పంపకాలు చేశాక, పెద్దవారిని శారీరకంగా, మానసికంగా హింసిస్తూ కన్న బిడ్డలే బయటకు గెంటేస్తున్నారని చెప్పారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఆర్థిక, ఆరోగ్య రక్షణ, ఆస్తుల భద్రత కోసం ఉచితంగా న్యాయము అందించాలన్నారు. వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టాన్ని పటిష్టంగా అమలు పరిచేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను, డివిజన్ స్థాయిలో ఆర్డీవో అధ్యక్షతన ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిస్సహాయ స్థితిలోఉన్న వృద్ధులు పూర్తి వివరాలతో ట్రిబ్యునల్ కు దరఖాస్తు చేసుకుంటే, 90 రోజులలో వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు.

మాట్లాడుతున్న మోహన్ రావు

అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి చట్టాన్ని తీసుకొచ్చిన విషయం జిల్లా స్థాయిలో వృద్ధులకు తెలియకపోవటం విచారకరమన్నారు. ప్రభుత్వ అధికారులు ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ ఇంకా ఏర్పడి దాదాపు 30 నెలల గడుస్తున్నా పట్టణంలో ఇంతవరకు ట్రిబ్యునల్ ఏర్పాటు చేయలేదని చెప్పారు. వెంటనే వృద్ధుల సంరక్షణ చట్టం 2007 ప్రకారం పట్టణంలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకట మురళిని, ఆర్డీవో రామలక్ష్మిని కోరినట్లు తెలిపారు.

రాఘవ రామశర్మకు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

రాఘవ రామశర్మకు సన్మానం

ప్రజాశక్తి-అద్దంకి

ప్రముఖ సినీ విమర్శకుడు వారణాసి రాఘవ రామశర్మను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని చిన్ని శాంతయ్య సేవా సదన్‌లో ఆదివారం ఎన్టీ రామారావు 29వ వర్ధంతి పురస్కరించుకొని స్మారక కళావేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, కైకాల సత్యనారాయణ, పలువురు ప్రముఖుల మధురస్మృతులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కోనేటి ఎంటర్ప్రైజెస్ అధినేత కోనేటి అనిల్ ఆర్థిక సహకారం అందించగా రోటరీ క్లబ్ జాయింట్ సెక్రెటరీ హరి ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. జన చైతన్య వేదిక కన్వీనర్ అన్నమనేని వెంకట్రావు సభకు అధ్యక్షత వహించి నందమూరి తారక రామారావు గురించి స్మారకోపన్యాసం చేశారు. సినీ విశ్లేషకులు వారణాసి రాఘవ రామశర్మ సినీ నటులు కైకాల సత్యనారాయణ సినీ జీవిత విశేషాలను సభకు వివరించారు. వీరవల్లి రుద్రయ్య, దేవపాలన, దివాకర్ దత్తు, చిన్ని మురళి, షేక్ మహమ్మద్ రఫీ తదితరులు ఎన్టీఆర్ మరియు కైకాల సత్యనారాయణ, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంధి రెడ్డి శ్రీనివాసరావు ఆర్ వి రాఘవరావు, చెన్నుపాటి, లేవి ప్రసాద్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, చప్పిడి వీరయ్య, చిన్న వివి బ్రహ్మం, నాగేశ్వరరావు అద్దంకి ఆర్టీసీ డిపో విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంతతిని పెంచడమే లక్ష్యం

ప్రజాశక్తి-పంగులూరు

పాడి పశువుల సంతతిని పెంచడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా పాల దిగుబడులు పెంచాలనే సంకల్పంతో ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా చర్యలు చేపడుతున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.సరిత అన్నారు. ఎదకు వచ్చిన గేదెలకు నిర్ణీత సమయంలో వ్యాక్సిన్ వేయించడం ద్వారా సూడి మోసిన గేదెలు పెద్దదూడలకు జన్మనిచ్చే అవకాశం ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సరిత అన్నారు. ఎద సమయంలో సూడి మోసేందుకు రెండుసార్లు వ్యాక్సిన్ ఇవ్వటం జరుగుతుందని, దీనికోసం రైతులు 500 రూపాయలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈత సమయంలో పెద్ద దూడ జన్మిస్తే గేదే యజమానికి వారు చెల్లించిన నగదును తిరిగి చెల్లించబడుతుందన్నారు. ఈ వ్యాక్సిన్ వినియోగించిన గేదెలకు 80 శాతం పెద్దదూడలు పుడుతున్నాయని ఆమె తెలిపారు. పెద్దదోడలు సంతతిని పెంచడం ద్వారా పాల ఉత్పత్తులు పెరుగుతాయనే ఉద్దేశంతో పశువర్ధక శాఖ అందుబాటులోకి తెచ్చిన వ్యాక్సిన్‌ని పాడి గేదెల పోషకులు వినియోగించుకోవాలని సరిత కోరారు.

పవన్ కళ్యాణ్ చొరవతో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు నిధులు

ప్రజాశక్తి-రేపల్లె

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతోనే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నిధులు మంజూరు చేసిందని జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ వ్యాఖ్యానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి ఆంధ్రులు సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ గతంలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఆంధ్రులు 32 మంది బలిదానాలను, త్యాగాలను స్మరించుకోవాలని మహేష్ అన్నారు. పవన్ కళ్యాణ్ కృషి, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మలిశెట్టి సాయి, షేక్ అక్రమ్, అల్లంశెట్టి గోవర్ధన్, బచ్చు సాయి, పరిశా పవన్ కళ్యాణ్, రేపల్లె రవి తదితరులు పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

ప్రజాశక్తి-అద్దంకి

శింగరకొండలోని పాలిటెక్నిక్ కళాశాలలో 21వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ తెలిపారు. ఈ జాబ్‌మేళాకు అరబిందో ఫార్మా, రవిలీలా గ్రానైట్స్, ఇలాగిరి డ్రోన్ సొల్యూషన్ కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. 100కి పైగా ఖాళీలు ఉన్నాయని విద్యార్హతను బట్టి జీతం ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, పీజీ చదివిన నిరుద్యోగులు బయోడేటా, సర్టిఫికెట్స్, పాస్‌ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8008986256 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రకాశం పంతులుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అద్దంకి

టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి వారి భర్త విజయ శంకర్ దంపతులు అద్దంకి విచ్చేసిన సందర్భంగా అద్దంకి నడిబొడ్డున ఉన్న ప్రకాశం పంతులు నిలువెత్తు విగ్రహానికి పులమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం మిత్రమండలి సభ్యులు గాడేపల్లి దివాకర్ దత్, పాలపర్తి జ్యోతిష్మతి షేక్ మహమ్మద్ రఫీ, చందలూరు నారాయణరావు, రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, పొట్టి సత్యనారాయణ, మస్తాన్ మాస్టారు, అద్దంకి లేవి ప్రసాద్, టీచర్ పోలి రెడ్డి, బాచిన పూర్ణ చంద్రరావు, లక్కరాజు శ్రీనివాసరావు, కృష్ణారావు, కాకర్ల వెంకటేశ్వర్లు చెన్నుపల్లి నాగేశ్వరరావు, ప్రముఖ రంగస్థల నటులు నరసింగరావు, ఆచారి పాల్గొని ప్రకాశం పంతులు త్యాగనిరతిని గుర్తు చేసుకున్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరు మండలం ఉల్లగల్లు గ్రామంలో ఇటీవల మృతి చెందిన పునుగుపాటి విజయరావు కుటుంబ సభ్యులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ తరుపున రూ.5 వేలు, డైరెక్టర్ రెడ్డిమాసు రాఘవులు సొంత నిధులతో మరో రూ.5 వేలు సాయంగా సంస్థ చైర్మన్ దేవత వర ప్రసాద్, రాఘవులు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, అధ్యక్షులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, సంస్థ ట్రెజరర్ గొర్రెపాటి వేణు, సంస్థ డైరెక్టర్లు జైహింద్ రెడ్డి, సుశీల, బిక్షాల రెడ్డి, పొదిలి మానవత సంస్థ శాంతి కమిటీ సభ్యులు ఎద్దు నాగేష్, సర్పంచ్ జనమాల నాగేంద్రం పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవటమే లక్ష్యం

- రబీ సాగుపై ప్రత్యేక శ్రద్ధ
- ఎన్‌పిఎస్ఎస్ యాప్‌ను వినియోగించుకోవాలి
- 38 మండలాల్లో పొలం బడి
- ఫసల్ బీమా యోజనతో ప్రయోజనాలు
- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

ముఖాముఖి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని రైతులను అన్ని విధాలుగా ఆదుకునే లక్ష్యంతో తాము పనిచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్ .శ్రీనివాసరావు తెలిపారు. 2024-25 రబీ సాగుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందజేశా మన్నారు. ఎరువులు అందుబాటులోఉన్నాయన్నారు. చీడ పీడల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన ఎన్‌పి ఎస్ఎస్, ఎపిఎస్ఎస్ యాప్‌లను రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సేవల గురించి ఆయన ప్రజాశక్తికి వివరిం చారు. ఆ విషయాలన్ని జిల్లా వ్యవసాయ అధికారి మాటలల్లోనే...

భూసార పరీక్షలు నిర్వహించి ఏయే సీజన్‌లో ఏ పంటలు వేయాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సబ్సిడీ ధరలకు విత్తనాల సరఫరా, అవసరమైన వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నాం. రబీ సీజన్‌కు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం.

రబీ సాగుపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలో రబీ సాగుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. రబీ సాధారణ సాగు విస్తీర్ణం 3,97,990.42 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 2,40,403.3 ఎకరాలలో వివిధ పంటలు సాగయ్యాయి. సాగు విస్తీర్ణం 60.42 శాతంగా నమోదైంది. ఇందులో వరి 11,127 ఎకరాలు, జొన్న 205 ఎకరాలు, మొక్కజొన్న 4,898 ఎకరాలు, శనగ 20,107 ఎకరాలు, కందులు 444 ఎకరాలు, మినుము 11,469 ఎకరాలు, పొగాకు 31,163 ఎకరాలు, మిర్చి 3806 ఎకరాలు, ఇతర పంటలు సాగయ్యాయి.

ఎన్‌పిఎస్ఎస్ యాప్‌ను వినియోగించుకోవాలి

చీడ పీడల నివారణకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్(ఎన్‌పిఎస్ఎస్) యాప్ రూపొందించింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి రైతులు డౌన్‌లోడ్ చేసుకోవాలి. పొలంలో చీడపీడల ఫొటో తీసి యాప్‌లోని క్యాప్చర్‌లో అప్‌లోడ్ చేయాలి. వెంటనే పంటకు సోకిన తెగులు, వినియోగించాల్సిన మందులు, ఇతర సలహాలు రైతులకు తెలియజేస్తారు. ప్రస్తుతం ఆంగ్ల భాషలో సలహాలు అందుబాటులో ఉండగా, త్వరలోనే ప్రాంతీయ భాషలలో లభించే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్వైలెన్స్ సిస్టమ్(ఎపిఎస్ఎస్) యాప్‌ను సైతం డౌన్‌లోడ్ చేసుకుని ఫొటోలు అప్‌లోడ్ చేస్తే సూక్ష్మ ధాతువు లోపాలు, తెగులు పరిస్థితి, వినియోగించాల్సిన మందులు, అవసరమైన సలహాలు రైతులు పొందవచ్చు

38 మండలాల్లో పొలం బడి

జిల్లాలోని 38 మండలాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం 2024 సెప్టెంబర్ 24 నుంచి జరుగుతోంది. రెండు సెషన్స్‌లో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు క్షేత్ర స్థాయి సందర్శన జరుగుతోంది. వ్యవసాయ అధికారులు పంట పొలాల్లో తెగుళ్ళు, ఇతర ఇబ్బందుల శాంపిల్స్ సేకరిస్తారు. ఉదయం 10 నుంచి 12 గంటల గ్రామ సభ జరుగుతోంది. ఇందులో వ్యవసాయ , అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొని చీడ పీడల నివారణ, వ్యవసాయ రంగంలోని సమస్యలపై చర్చ జరుపుతారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, లబ్ధిదారుల ఎంపిక, ఏ స్కీమ్స్‌కి ఎవరు అర్హులనే విషయాలు చర్చిస్తారు. మధ్యాహ్నం 2- 4 గంటల వరకు రైతులతో సమావేశం, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ఫీల్డ్ విజిట్ జరుపుతారు.

ఫసల్ బీమా యోజనతో ప్రయోజనాలు

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో 1,49,088 మంది రైతులు 2,09,601 ఎకరాలకు బీమా చేయించుకున్నారు. ఆరు పంటలకు సంబంధించి రైతులు రూ.4,90,60,611 బీమా ప్రీమియంగా చెల్లించారు. తుపాన్లు, తుపాన్ ప్రభావిత వర్షాలు, అకాల వర్షాలు కురిసినప్పుడు పంటల నాశనం కావటం, దెబ్బ తింటే రైతులకు నిర్దేశించిన విధంగా బీమా మొత్తాలను రైతులకు అందిస్తారు. వాతావరణ ఆధారిత, పంట ఆధారితంగా దెబ్బతిన్న పంటలకు రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తోంది. రానున్న కాలంలో ఇతర శాఖల సహకారంతో వ్యవసాయ రంగాన్ని రైతులను మరింతగా ఆదుకునేందుకు చర్యలు చేపడతాం.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

గత ప్రభుత్వ హయాంలో ఇంటి పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు పొజిషన్లు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం ఒంగోలు నగర ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలుకు నిరసనగా ప్రజలందరూ ప్రతిటించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సర్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒంగోలు నగరంలో 4,150 మందికి టిక్కో ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వాటి నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు శ్రీనివాసులు, స్వామి, జి.ఆదిలక్ష్మి, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు